ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

చెరుకు రైతుల కన్నెర్ర

- గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహా ధర్నా, రాస్తారోకో
- బకాయిలు చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేలా చూడాలని డిమాండ్
- సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



రోడ్డుపై బైఠాయించి నినదిస్తున్న చెరుకు రైతులు, నాయకులు

ప్రజాశక్తి - చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతులు కన్నెర్రజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం ఫ్యాక్టరీ ఎదుట మహాధర్నాకు దిగారు. బకాయిలు చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేలా చూడాలని, చెరుకుకు గిట్టుబాటు ధర కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహా ధర్నాకు ముఖ్య అతిథిగా చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. చెరుకు రైతులకు బకాయిలను వెంటనే చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపిలోని చెరుకు రైతుల పరిస్థితి దినదినగండంగా మారిందన్నారు. నూతన వంగడాలను ప్రవేశ పెట్టకపోవడం వల్ల చెరుకు దిగుబడి తగ్గి, ఖర్చులు పెరిగి రైతులకు నష్టాలు వాటిల్లుతున్నాయన్నారు. కనీస గిట్టుబాటు ధర రూ.5 వేలు చెల్లిస్తే తప్ప రైతులు చెరుకు సాగు చేసే పరిస్థితి కానరావడం లేదన్నారు. సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు మాట్లాడుతూ 24 వేల మంది రైతులు గోవాడ ఫ్యాక్టరీ పరిధిలో గతంలో చెరుకు సాగు చేసేవారని, నేడు ఆ సంఖ్య 5 వేల మందికి పడిపోయిందని తెలిపారు. చెరుకు రైతులే కదా అని చిన్న చూపు చూస్తే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు అంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు కనీసం ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలతో పాటు అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ మిగతా 2లో..

సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే చట్టాలు అవసరం

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు

ఎయులో జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆధునిక సాంకేతికత విసిరే సవాళ్లకు సమాధానమిచ్చే పటిష్టమైన చట్టాలను రూపకల్పన చేయాల్సిన అవసరముందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు అన్నారు. ఎయులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు వస్తాయని తెలిపారు. శాస్త్రీయ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని, అదే సమయంలో కొన్ని కొన్ని సవాళ్లు సైతం ఎదురవుతున్నాయని ఉదాహరణలతో వివరించారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మార్పులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో వచ్చిన ఎన్‌డిపిఎస్ చట్టం ప్రాధాన్యతను వివరించారు. గత నాలుగు సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా రూ.13 వేల కోట్ల విలువైన మత్తు పదార్థాలను పట్టుకున్నారని చెప్పారు. ఇంటర్నెట్ ఆగమనంతో వచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ గురించి వివరించారు. సైబర్ నేరాలు, శిక్షలు ఏ విధంగా విధిస్తారు ? అనే అంశాలను తెలియజేశారు. న్యాయవాద వృత్తి సోషల్ ఇంజినీరింగ్ అని చెప్పారు. గత దశాబ్ద కాలంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తెర మీదకు వచ్చిందని, దీనిని విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు. మేధో హక్కులకు భంగం కలిగే అవకాశం దీంతో ఏర్పడుతోందని చెప్పారు. అదేవిధంగా కాపీరైట్ చట్టం ఉల్లంఘన జరిగే అవకాశాలు సైతం ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో మేధో చర్చలు జరగాలని సూచించారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ యువ న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. దేశ వ్యాప్తంగా 24 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించండి

వార్త 8లో..

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రూ.3.41 కోట్ల పన్ను చెల్లింపు

వార్త 8లో..

కారిడార్ రోడ్డు పనులు అడ్డగింత

వార్త 8లో..



అంశాలపై చర్చ జరుపుతున్న సభ్యులు

జివిఎంసి స్థాయీ సంఘంలో 101 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం 101 అంశాలకు ఆమోదం తెలిపింది. స్థాయీ సంఘం ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అజెండాలో 104 అంశాలను పొందుపరచగా స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప ఒక అంశాన్ని వాయిదా వేశారు. రెండు అంశాలను తిరస్కరించారు. మిగిలిన 101 అంశాలు ఆమోదం పొందాయి. వాటిలో మిగతా 2లో..

విశాఖ అభివృద్ధిపై సమీక్ష

టిడిఆర్ బాండ్ల జారీలో వేగం పెరగాలి : మంత్రి నారాయణ

మాస్టర్ ప్లాన్‌పై పునరాలోచన చేయాలి : ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని విశాఖపట్నంలో అభివృద్ధి చర్యలు చేపట్టాల్సి ఉందని, దానికి తగినట్లు అక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. నగర అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలు, డిటిఆర్ బాండ్ల జారీ తదితర అంశాలపై శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన సమీక్షించారు. స్థానిక ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పి.గణబాబు, పంచకర్ల రమేష్ బాబు, సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణు కుమార్ రాజు, కొణతాల రామకృష్ణ, ఎపియుఎఫ్ఐడిసి ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ పి.సంపత్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మంత్రితో కలిసి సమీక్షలో పాల్గొనగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వర్చువల్‌గా భాగస్వామ్యమయ్యారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ విశాఖలో టిడిఆర్ బాండ్ల జారీలో మరింత వేగం పెంచాలని, చాలా వరకు పెండింగ్ ఉన్నట్లు తన దష్టికి వచ్చిందని తెలిపారు. మెట్రో, మెట్రో లైట్, మోడరన్ ఎలక్ట్రిక్ బస్ కారిడర్లపై ప్రధానంగా చర్చించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టులను దశల వారీగా చేపట్టేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం వహించాలన్నారు. జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పలు అంశాలపై స్పందించారు. టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియలో మరింత లోతుగా పరిశీలించాల్సి ఉందని, తర్వాత వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్, తాగునీటి సదుపాయం, అంతర్గత రోడ్ల అభివృద్ధి, ప్రభుత్వ నిబంధనల అమలు, ఆక్రమణల తొలగింపు విషయంలో మరింత అప్రమత్తంగా ఉంటామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

విశాఖ అభివృద్ధిపై జరిగిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

చెరుకు రైతుల కన్నెర్ర

ఎక్కడ దాక్కున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తామని పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులు ఫ్యాక్టరీ విషయంలో ముఖం చాటేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, సిఐటియు నాయకులు వివి.శ్రీనివాసరావు, జి.వరలక్ష్మి, నాయుడు, సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, రైతు కూలీ సంఘం కన్వీనర్ కె.మోహన్ రావు, చెరుకు రైతుల సంఘం జిల్లా నాయకులు సదాశివరావు, గండి నాయన బాబు, ఆర్.ముత్యాల నాయుడు, ఈర్లె నాయుడు బాబు, ఎర్ర దేవుడు, రొంగల దేముడునాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, పినపాత్రుని సాంబశివరావు, సింహాచలం, బొడ్డేటి సన్యాసినాయుడు, పెంటయ్య, పడాల కొండలరావు పాల్గొన్నారు.

ఉద్రిక్త పరిస్థితులు

మహాధర్నాకు తోడు రైతులు రాస్తారోకోకు దిగడంతో ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రాస్తారోకో నిర్వహిస్తున్న ఆందోళనకారులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రైతులు భీష్మించుకొని కూర్చోవడంతో చేసేదిలేక పోలీసులు చేతులెత్తేశారు. అనంతరం సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డిని కలవడానికి చెరుకు రైతుల సంఘం నాయకులతో పాటు రైతులు ఫ్యాక్టరీలోకి వెళుతుండగా మరోమారు పోలీసులు అడ్డగించారు. దీంతో ఆగ్రహించిన రైతులు మరో మారు రోడ్డుపైకి ఆందోళనకు సిద్ధమయ్యేసరికి సుగర్స్ ఎమ్‌డి సన్యాసినాయుడు దిగిరాకతప్పలేదు. క్రషింగ్‌ను వేగవంతంగా జరపాలని. బకాయిలు వెంటనే చెల్లించాలని, స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, టన్నుకు రూ.5 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని, ఫ్యాక్టరీని ఆధునికీకరించడానికి నివేదికలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేయాలని నేతలంతా ఎమ్‌డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ ఏడాది చెరుకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు రూ.3 వేలు చొప్పున పేమెంట్లు చెల్లిస్తామన్నారు. ఆధునికీకరణకు సంబంధించి ఇప్పటికే నివేదికలు పంపించినట్టు తెలిపారు. కాలం చెల్లిన యంత్రాలతో క్రషింగ్ ఆలస్యం అవుతోందని తెలిపారు. ఇప్పటివరకు 80 వేల టన్నులు గానుగ ఆడామని, మరో 30 వేల టన్నులను 20 రోజుల్లో పూర్తి చేస్తామని అన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో 101 అంశాలు ఆమోదం

ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం, పలు అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించినవి ఉన్నాయి. సమావేశంలో కార్యదర్శి బి.వి.రమణ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డి, జోనల్ కమిషనర్లు ప్రేమ ప్రసన్నవాణి, శివప్రసాద్, మల్లయ్య నాయుడు, బి.రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చిరంజీవి, గంగాధర్‌రావు, సుధాకర్, అప్పారావు, సహాయ వైద్యాధికారులు డాక్టర్ ఎన్.కిషోర్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ అప్పలనాయుడు , డాక్టర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధిపై సమీక్ష

సమీక్షలో ప్రధానంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులపై చర్చించారు. గతంలో కొందరి ప్రయోజనాల దృష్ట్యా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై పునరాలోచన చేయాలని, తప్పకుండా మార్పులని స్థానిక ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. రోడ్ల విస్తరణ అవసరం ఎంత మేరకు ఉందో అంతవరకే ప్లాన్ అమలు చేయాలని, భూసేకరణ చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజలు, నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నాకే ప్లాన్ అమలు విషయంలో ముందుకెళ్లాలన్నారు. విశాఖ కలెక్టరేట్ మీటింగు హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జివిఎంసి అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యమయ్యారు.

బిఎస్ఎన్ఎల్ కేబుల్ దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని ద్వారకా క్రైమ్ సబ్ డివిజన్ పరిధిలో ఎంవిపి.కాలనీ ప్రాంతంలో సుమారు 2.4 లక్షల విలువగల బిఎస్ఎన్ఎల్ వైర్లను దొంగిలించిన ఎనిమిది మంది సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్టు ద్వారకా క్రైమ్ ఇన్‌స్పెక్టర్ చక్రధరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం బిఎస్ఎన్ఎల్ సంస్థలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న చుట్టూరు మురళి తమ సంస్థకు చెందిన సుమారు 300 కేజీల బరువుగల రూ.2.4 లక్షల విలువచేసే రాగి వైర్లు చోరీకి గురయ్యాయి, గుర్తు తెలియని వ్యక్తులు ఎంవిపి డబుల్ రోడ్డు ప్రాంతంలో రాత్రిపూట రోడ్డును తవ్వి ఈ చోరీకి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదు మేరకు క్రైమ్ ఎఎస్ఐ డి.కిషోర్ బాబు, హెడ్ కానిస్టేబుల్ జి.వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ హరిప్రసాద్‌లు బృందంగా ఏర్పడి ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా కొంతమంది వ్యక్తులు రాత్రి సమయంలో జివిఎంసి ఉద్యోగుల వలే వచ్చి రోడ్డును తవ్వినట్టు గుర్తించారు. అనంతరం సాంకేతిక ఆధారాల సహాయంతో విశాఖ నగరానికి చెందిన ఆసనాల పిట్టోడు, తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన గంజ గోవర్ధన్, పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన బత్తుల శ్రీను, బత్తుల ఏడుకొండలు, బత్తుల రాజు, చీకూరి దుర్గాప్రసాద్, దేవల రాజేష్, బత్తుల ప్రసాద్‌లను ముద్దాయిలుగా గుర్తించి అరెస్టు చేశారు.

జివిఎంసి కమిషనర్‌ను వెంటనే నియమించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండు నెలలుగా జివిఎంసి కమిషనర్‌ను నియమించకుండా తీవ్ర బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం పేర్కొంది. ఆ వైఖరిని శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించింది. తక్షణమే జివిఎంసికి కమిషనర్‌ను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అతిపెద్ద మహా నగరం విశాఖపట్నమని, 25 లక్షలకుపైగా జనాభా ఇక్కడ ఉందని, నిత్యం రాష్ట్ర ప్రభుత్వం విశాఖ అభివృద్ధి జపం చేస్తోందిగానీ రెండు నెలలుగా కమిషనర్‌ను నియమించకపోవడం, గతంలో నియమించిన కమిషనర్‌ను ఐదు నెలలు తిరగక ముందే బదిలీ చేయడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను, వైఫల్యాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. రెండు నెలలైనా కమిషనర్‌ను నియమించకపోవడానికి ఏమి ఆటంకాలొచ్చాయో ప్రభుత్వం ప్రజలకు చెప్పాల్సి ఉందన్నారు. కూటమి పార్టీల మధ్య విభేదాలు పరిష్కారం కాక పోవడం వల్ల ఎవరినీ నియమించలేదా ?.. ఇదే వాస్తవమైతే స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు విశాఖ నగర ప్రజలను బలితీసుకోవటమే అవుతుందని తెలిపారు. కమిషనర్ లేకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రజల సమస్యలను, ఫిర్యాదులను పరిష్కరించే నాథుడే కరువయ్యాడని తెలిపారు. మంచినీటి సమస్య అనేక ప్రాంతాల్లో పెరిగిందని గుర్తుచేశారు. మార్చి నెల చివరికి వచ్చినప్పటికీ 2025-26 బడ్జెట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో జివిఎంసి ఆర్థిక లావాదేవీలు, వేతనాలు, మౌలిక సేవల ఏర్పాటు, పౌర సేవల వంటివన్నీ నిర్వీర్యమై పోనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే జివిఎంసి బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గాజువాక వారి కోర్టులో
I.A.1655/2022 in O.S.84/2021

బిట్వీన్:
కంచరాపు శివ నాగమణి ...పిటీషనరు/వాది
అండ్:
గవర హేమంత్ శ్రీనివాస రావు వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

నోటీసు

టు,
రెస్పాండెంట్ నెం.3:
శ్రీమతి ప్రగడ లక్ష్మి, W/o. పి. శేషు, వయస్సు: 38 సం||లు, హౌస్ వైఫ్, నివాసం: డోర్ నెం.5-96, వివేకనందనగర్, ఫోర్త్ లైన్, ఓల్డ్ డైరీ ఫార్మ్ పోస్ట్, విశాఖపట్నం-530040.

ఇందుమూలంగా 3వ రెస్పాండెంట్/ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా పైనెంబరు పిటీషన్‌లో శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా మీకు ఆర్డరు వేసినారు. కావున మీకు **తేది. 08-04-2025**కి వాయిదా అయివున్నది. సదరు తేదిన మీరు ఉ||గం|| **10.30ని||**లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని లేదా లాయరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటీషన్ విచారణచేసి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(By Order of the Hon'ble Court)
G.V.S. RAJU, Advocate
Kurmannapalem, Visakhapatnam.
Cell: 94410 02112

నోటీసు

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
I.A. 499/2024 in C.M.A.S.R. 1712/2024

Between:
గేదెల గోపాలకృష్ణ
-పిటిషనరు/ అప్పిలెంటు
మరియు
గేదెల కేశవానందస్వామి
-రెస్పాండెంటు/ రెస్పాండెంటు

గేదెల కేశవానందస్వామి, S/o. లేటు సూరరాజు, డో.నెం. 7-8-4, ప్రశాంతి నగర్, పెందుర్తి, విశాఖపట్నం.

పై కేసులో కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు నోటీసు పంపడమైనది. పై కేసులో మీరు **ది. 7-4-2025వ తేదీన ఉదయం 10.30 గం||లకు** పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో కోర్టు వారు మీ పరోక్షమున ఆర్డరు చెప్పుదురు.

వాయిదా: 7-4-2025
టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేటు
కాకినాడ, సెల్: 9440337629

IN THE HON'BLE COURT OF THE METROPOLITAN SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
Crl. M.P.138/2023

Between:
Youth Hoste Association of India,
A.P. State Branch, Rep. by its Chairman Sri Ch. Sreenivas Prasad
...Revision Petitioner/Complainant/ Respondent
And:
Barri Uma Maheswara Rao & 3 others
...Respondents/Accused No.2 to 5 / Petitioners

NOTICE

To,
R-2: Sri Barri Uma Maheswara Rao, S/o. not known, Hindu, aged 63 years, R/at Quarters No. 99-A, Sector-1, Ukkunagaram, Visakhapatnam.
R-3: Sri Cheemala Ravipal, S/o. not known, Christan, aged 49 years, R/at Quarters No. 2121/12, Sector-4, Ukkunagaram, Visakhapatnam.
R-4: Sri M. Sai Rama Raju, S/o. not known, Hindu, aged 49 years, R/at Plot No.LIG-34, D.No.31-45-6/1, Phase-2, VUDA Nagar, Kurmannapalem, Visakhapatnam-49.
R-5: Sri Avala Pundarikaksha, S/o. late Appalaswamy, Hindu, aged 66 years, R/at Plot No.252 MIG-II, MVP Colony, Visakhapatnam-17.

Please take notice that the above named Revision Petitioner/Complainant has instituted the above case against all of you and the matter stands posted to **07-04-2025** for your appearance. Therefore, you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **07-04-2025** at **10:30 A.M** in the above Court, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

V.D.V.N. MURTY, & V.S.MEGHANAA NAIDU Advocates
Visakhapatnam.**Cell: 9848404247.**

నోటీసు

విజయనగరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 324/2024 in OS 48/2018

నలజాన పరమేశ్వరి ......పిటీషనరు/వాది
నలజాన శంకరరావు (Died) వగైరాలు
....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To
R13. నలజాన శ్రీకాంత్ S/o లేటు జగన్నాధరావు, అసిస్టెంటు మేనేజరు, S.H.P.L.Company, Sahuwala High Pressure Cylinders (P) Ltd, G.బ్లాక్, ఆటోనగర్, విశాఖపట్నం - 530012.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన నలజాన జగన్నాధరావు గారి మరణానంతరం వారి వారసులను చేర్చుగలందులకు అయిన ఆలస్యమును నివృత్తి చేయగలందులకు పై నెంబరు పిటిషను దాఖలు చేయగా అందులో మీకు గల ఆక్షేపణలు ఉన్న యెడల **తే 4-4-2025ది**న పగలు గం||**10-30 ని||**లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయముగా కాని, వకీలు ద్వారాగాని హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలు దాఖలు చేసుకోగలందులకు కోరడమయినది. లేని యెడల సదరు విషయము మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరని యిందు మూలముగా తెలియజేయడమైనది. కాగా యిది పై కోర్టువారి ఆర్డరు ప్రకారం ప్రకటించడమైనది.

శ్రీ పోతుల రాంబాబు
పిటిషనరు తు|| న్యాయవాది,
విజయనగరం.

గ్రామ పంచాయతీ కార్యాలయము - వేములపూడి

రేఖా నెం. 01-2025 తేదీ.22-03-2025

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలం, వేములపూడి గ్రామ పంచాయితీ మరియు గ్రామం, శివారు గ్రామాల యందు గల **PWS** స్కీములు నిర్వహణ, వీధిలైట్లు నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బంది మొదలగు వారిని కాంట్రాక్టు పద్ధతిపై సప్లయి చేయుటకుగాను తేది : 27-03-2025 గురువారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడుతాయి. మరలా తిరిగి ఇదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అందరి సమక్షంలో టెండర్లు ఖరారు చేయగలరని అలాగే వెనువెంటనే రోజూ వారి సంత యొక్క ఆశీలు వసూలు చేసుకొనుటకు బహిరంగవేలం నిర్వహించబడును. ఈ ప్రక్రియ అంతా గ్రామపంచాయతీ కార్యాలయం, వేములపూడి నందు శ్రీ పంచాయితీ కార్యాలయం కార్యదర్శి వారి సమక్షంలో నిర్వహించబడును. అంతేగాకుండా ఈ సీల్డు కవరు టెండరు నందు పాల్గొను అభ్యర్థులు ముందుగా 10,000.00 అక్షరములా పదివేల రూపాయలు ధరావత్తు చెల్లించవల్సియుండును.

సం/- పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ-వేములపూడి, నర్సీపట్నం మండలం.

గ్రామ పంచాయితీ కార్యాలయం - దాకమర్రి

రేఖా నెం. 14/2025 టెండరు ప్రకటన తేదీ.22-03-2025

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండలం, దాకమర్రి గ్రామపంచాయితీ నందు, దిగువ షెడ్యూలు నందుదహరించిన పనులను 2025-26 సం.నకు కాంట్రాక్టు పద్ధతిపై చేయుటకు పనివార్ని సప్లయి చేయుటకు తే: 26-03-2025దిన మధ్యాహ్నం 12 గంటల వరకు దాకమర్రి గ్రామ సచివాలయం నందు ఈ దిగువ సంతకం దారునివే గానీ, వారి అనుమతి పొందిన యితర ఉద్యోగివే గానీ, సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం.3.00 లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు టెండరు ధరవత్తు చెల్లించి, టెండరు షరతులకు లోబడి టెండర్లలో పాల్గొనవలెను.

షెడ్యూల్

క్ర నెం	పని వివరములు	పనివారి సంఖ్య	ధరావత్తు రూ.
1	పారిశుధ్య పనులు	07	
2.	వీధిలైట్లు నిర్వహణ & బిగింపు పనులు	02	
3.	మంచినీటి పంపు ఆపరేటింగ్ & నిర్వహణ పనులు ప్లంబర్ పనులు	04	10,000/-
4.	ట్రాక్టర్ సప్లై	01	

గమనిక : **(1)** పై పనుల యొక్క టెండర్లు శ్రీ జిల్లా కలెక్టర్ (పం.వి.), విశాఖపట్నం వారి అనుమతికి లోబడి ఖరారు చేయుట మరియు కాంట్రాక్టు పనులకు చెల్లింపులు చేయుట జరుగును. **(2)** టెండర్లు ఎట్టి కారణం చూపి గానీ, చూపకుండా గానీ, రద్దు పరుచుటకు, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు గ్రామపంచాయితీకి పూర్తి అధికారము గలదు. **(3)** పూర్తి షరతులు, యితర వివరములు కార్యాలయ పనివేళలందు పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించి తెలుసుకొనగలరు.

సం/- బి.సౌజన్య, పంచాయితీ కార్యదర్శి,
గ్రామపంచాయితీ, దాకమర్రి
భీమునిపట్నం మండలం

సం/- చెల్లూరి పైడప్పుడు, సర్పంచ్,
గ్రామపంచాయితీ, దాకమర్రి
భీమునిపట్నం మండలం.

IN THE COURT OF THE HON'BLE Prl. JUNIOR CIVIL JUDGE AT NIZAMABAD
O.S. No. 532 of 2022

Between:-
M/s. Sri Siddirameshwer Agro Industries Private Ltd., Nizamabad, Kaloor (V), (M) & Dist. Nizamabad, Represented By its Managing Director Sri. Kaparthi Shravan' Kumar S/o Kaparthi Chandra Prakash Aged: 52 years, Occ: Business, R/o. Nizamabad. ...Plaintiff
AND
SRI SAIRAM TRADERS, rep by its prop. Shop No.1, Town Kotha Road, Viskapatnam-530016. ...Defendant.

To
A SRI SAIRAM TRADERS, rep by its prop. Shop No.1,Town Kotha Road, Viskapatnam-530016.

Where as above named plaintiff has instituted suit against you for recovery of amount you are hereby summoned to appear in this court in person or by. Pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall be accompanied by some other persons able to answer all such questions on the 8th day of May 2025 at 10.30'oclock in the forenoon to answer the claim and you are directed to produce on that day all documents on which you lead to rely in support of your defense.

Take notice that in default of your appearance on the day above mentioned the suit will be determined in your absence.

"By the Order of the Court"
J.Venkateshwar B.com.LLM.
And
N.Santosh, M.Shyam Babu, Advocates
Nizamabad
Cell No : 9866228425

IN THE COURT OF THE HON'BLE Prl. JUNIOR CIVIL JUDGE AT NIZAMABAD
O.S. No. 528 of 2022

Between:-
M/s. Sri Siddirameshwer Agro Industries Private Ltd., Nizamabad, Kaloor (V), (M) & Dist. Nizamabad, Represented By its Managing Director Sri. Kaparthi Shravan Kumar S/o Kaparthi Chandra Prakash Aged: 52 years, Occ: Business, R/o. Nizamabad. ...Plaintiff
AND
A.S.R. TRADERS, Rep. by its prop., H.No.26-1-29/1. Poorna Trade Centre, G-6, Bowdara Road, Visakapatnam - 530-001-A.P ...Defendant.

To
A.S.R. TRADERS, Rep. by its prop., H.No.26-1-29/1. Poorna Trade Centre, G-6, Bowdara Road, Visakapatnam-530-001-A.P

Where as above named plaintiff has instituted suit against you for recovery of amount you are hereby summoned to appear in this court in person or by Pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall be accompanied by some other persons able to answer all such questions on the 8th day of May 2025 at 10.30'oclock in the forenoon to answer the claim and you are directed to produce on that day all documents on which you lead to rely in support of your defense.

Take notice that in default of your appearance on the day above mentioned the suit will be determined in your absence.

"By the Order of the Court"
J.Venkateshwar B.com.LLM.
And
N.Santosh, M.Shyam Babu, Advocates
Nizamabad
Cell No : 9866228425

కబ్జాల పరిశీలనలో రగడ

వైసిపి, కూటమి నేతల బాహాబాహి



ఒకరినొకరు తోసుకుంటున్న కూటమి, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలం జెర్రిపోతుల పాలెం గ్రామంలో భూకబ్జాల పరిశీలనలో భాగంగా శుక్రవారం 420 చెరువును చూసేందుకు వచ్చిన కూటమి నేతలు, స్థానిక వైసిపి నాయకుడు కోన శ్రీను, సర్పంచ్ అప్పలరాజు మధ్య వివాదం చోటుచేసుకుంది. కూటమి నేతలు చెరువులో అక్రమణలు ఉన్నాయని పరిశీలిస్తుండగా, వైసిపి నాయకులు జోక్యంతో అక్కడ తోపులాట జరిగింది. అక్కడే ఉన్న కూటమి నాయకులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం జనసేన నాయకులు గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ ప్రాంతంలో కబ్జాలపై కూటమి నేతలంతా పరిశీలన జరిపి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. గతంలోనూ ఇలాంటి కబ్జాలను అడ్డుకున్నందుకు తనపై కొంతమంది తిరగబడ్డారన్నారు. ఆక్రమణలను అడ్డుకోవడంలో వెనక్కు తగ్గేది లేదని, ఎక్కడెక్కడ కబ్జాలు ఉన్నాయో గుర్తించి, ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మడక అప్పలరాజు, శివ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాల్యం విద్యాకేంద్రాల సమస్యలపై నివేదన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి ఆధీనంలోని 37 బాల్యం కేంద్రాల్లోని బాలలు వసతి, పౌష్టికాహారం, తదితర సమస్యలను జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం అక్కయ్యపాలెం, ఎన్జిఒస్ కాలనీ జివిఎంసి ప్రాథమిక పాఠశాల ఆవరణలోని బాల్యం కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పరిస్థితులపై బాల్యం ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మోహన్‌కుమార్, ఉపాధ్యాయురాలు డి.చిన్నమ్ముడును అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా సీతారాం మాట్లాడుతూ, ఐదేళ్లలోపు బిపిఎల్ చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో జివిఎంసి పర్యవేక్షణలో 37బాల్యం కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కరోనా తర్వాత నిలిచిన మధ్యాహ్నభోజనం, బూట్లు, యూనిఫాం, బెల్టు ప్రభుత్వపరంగా జివిఎంసి సమకూర్చేలా కమిషన్ తరపున నివేదిస్తామన్నారు. సీతమ్మధార ఎంఇఒలు రామారావు, బాలా మణి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, హెచ్ఎం పద్మజారాణి, బాల్యం పథకం సూపర్వైజర్ జె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-ఆనందపురం: తమ సమస్యల పరిష్కారంతోపాటు పనిఒత్తిడి తగ్గించాలని మండలంలోని పంచాయితీల కార్యదర్శులు కోరారు. శుక్రవారం ఎంపిడిఒ డాక్టర్ వి.జానకికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వివిధ రకాల సర్వే బాధ్యతలను అప్పగించడం వలన పనిభారం పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, సెలవు రోజు కూడా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఫర్నీచర్

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని టి నగరపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ. 95 వేల సిఎస్ఆర్ నిధులతో ఫర్నిచర్‌ను శుక్రవారం దివ్వాడ దివీస్ సంస్థ సమకూర్చింది. ఔషధాలు భద్రపరిచే బీరువా, రోగులు కూర్చునేందుకు మూడు సీట్ల కుర్చీలు, ఐరన్‌బెడ్, చుట్టూరా సేఫ్టీ గ్రిల్‌ను సమకూర్చారు. స్థానిక సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, గ్రామపెద్దలు చంద్ర శేఖర్ విజ్ఞప్తి మేరకు దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో వీటిని సమకూర్చినట్లు సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కార్యదర్శి శశికళ, సిహెచ్ఒ స్వాతి, సిఎస్ఆర్ ప్రతినిధులు శ్రీనివాస్, పి శేఖర్‌బాబు, కనకరాజు, ఎఎన్ఎం రమణకుమారి పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కు అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) కార్పొరేట్ సామాజిక బాధ్యతగా రూ.27.50 లక్షల విలువైన అధునాతన అంబులెన్స్‌ను సమకూర్చింది. శుక్రవారం గెయిల్ చీఫ్ జిఎం (ఓఅండ్ఎం పైపులైన్) ఎల్ఎస్.రావు, జిఎంఎంవిఎస్.మూర్తి అంబులెన్స్‌ను శంకర్ ఫౌండేషన్ జిఎం కె రాధాకృష్ణన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గెయిల్ జిఎం ఎల్ఎస్.రావు మాట్లాడుతూ, సమాజానికి పేదప్రజల అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఫౌండేషన్ చేస్తున్న ప్రజారోగ్యసేవకు సహకారంగా తమవంతు బాధ్యతగా అంబులెన్స్ అందించామన్నారు. గెయిల్ యాజమాన్యానికి శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జిఎం కె రాధాకృష్ణన్, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిజిఎం వి.రమేష్ కుమార్, శంకర్ ఫౌండేషన్ డిజిఎం (పిఆర్) కె.బంగార్రాజు, గెయిల్ డిజిఎం స్టీఫెన్ పట్టా, చీఫ్ మేనేజర్ (హెచ్ఆర్) మదన్ కులాడే, మేనేజర్ (ఫైనాన్స్) ఎ కిరణ్, సిఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు.



అంబులెన్స్ ప్రారంభిస్తున్న గెయిల్ జిఎంలు

అడవుల ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో శుక్రవారం విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ ఏడాది అరణ్యాలు - ఆహారం, ఆహార భద్రత, జీవవైవిధ్య పరిరక్షణలో అడవుల ప్రాముఖ్య అనే అంశాన్ని ముఖ్య భూమికగా సాగిన కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ అరణ్యాలు గ్లోబల్ ఆహార సరఫరాకు, పర్యావరణ సమతుల్యతకు ఎలా సహాయ పడతాయో వివరించారు. టెర్రర్ గార్డెన్ వ్యవస్థాపకురాలు ఐశ్వర్య మాచవరపు ఇంటి తోటలు, స్థిరమైన ఆహార ఉత్పత్తికి విలువైన సూచనలు అందించారు. తమ స్వంత ప్రదేశాలలో పండ్ల చెట్లు, కూరగాయలు పెంచుకోవడం ఎలా అనే విషయాలను విద్యార్థులు ఉత్సాహంగా నేర్చుకున్నారు. కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాజువాకలో మొక్కలు నాటుతున్న డాక్టర్ సుధాకర్

గాజువాక : ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా గాజువాక పిహెచ్‌సిలో శుక్రవారం ప్రజా పౌర హక్కుల రక్షక, సాంఘిక సంక్షేమ సంఘం సౌజన్యంతో వైద్యులు డాక్టర్ ఎం. సుధాకరరావు, ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సిహెచ్ఒ నాగ అప్పారావు, ప్రజా పౌర సంస్థ చైర్మన్ విశ్వనాథ్, విజయకుమార్ నాయక్, వివిఎస్‌వి ప్రసాద్, సుధాకర్, లక్ష్మణస్వామి, రాజేశ్వరి, రంగనాథ్, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు..

వర్సిటీల ప్రగతిలో విద్యార్థుల పాత్ర ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల ప్రగతిలో విద్యార్థుల పాత్ర ప్రశంసనీయమని ఆంధ్రయూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహరావు కొనియాడారు. శుక్రవారం ఎయు తెలుగు విభాగంలో ఆధునీకరించిన సెమినార్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. 30 ఏళ్ల కిందట తాము విధుల్లో చేరినప్పుడు ఆర్ట్స్ కళాశాలలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండేవని, ఈ విభాగంపై చిన్నచూపు ఉండేదన్నారు. నేడు ఎయుకు నాక్ ర్యాంకులో ఆర్ట్స్ కళాశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు.

వర్సిటీల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, పరిశోధకులు, ఆచార్యులు అందిస్తున్న సహాయ సహకారాలు ప్రశంసనీయమన్నారు. ఎయు నేడు అన్ని విభాగాల్లో పురోగమిస్తోందన్నారు. తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ ఎయులో అన్ని విభాగాలకు తెలుగు విభాగం ఆదర్శం కావాలన్నదే లక్ష్యమని, అందరి సహకారంతో ఈ విభాగాన్నిఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు. తెలుగు విభాగం విద్యార్థులు నేడు విశేష ప్రతిభాపాటవాలతో విభిన్నరంగాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య అప్పారావు, ప్రిన్సిపల్ నరసింహారావులను సెకెండియర్ విద్యార్థి గంట్ల శ్రీనుబాబు సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం ఆచార్యులు గజ్జ యోహానుబాబు, వెంకటేశ్వర్లు యోగి, ఎ.ఈశ్వరమ్మ, కట్టెపోగు రత్నశేఖర్, పెండ్యాల లావణ్య, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు..

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి- పెందుర్తి : సత్తివానిపాలెం, గవర జగ్గయ్యపాలెం రేవల్ల చెరువు ఆనుకొని పిచ్చిమొక్కలను శుక్రవారం జివిఎంసి యంత్రాంగం జెసిబితో తొలగించింది. ఇక్కడ పిచ్చిమొక్కలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశాలతో జనసేన నేత గల్లా శ్రీనివాసరావు జివిఎంసి యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించి జెసిబితో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు.

కార్యక్రమంలో రేవళ్లచెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ ముత్త అర్జున్, వైస్ ప్రెసిడెంట్ పొండ్రంగి రమణ, సభ్యులు పొండ్రంగి సత్యరాజు, ఆళ్ళ అప్పలనాయుడు, ఆళ్ళ సూరిబాబు, నక్కల ఈశ్వరరావు టిడిపి నాయకులు ఓమ్మి సత్యం, ముత్తా సత్తిబాబు, పోలమరశెట్టి బుల్ రాజు, జనసేన నాయకులు బుదిరెడ్డి శివ గంగునాయుడు, సూరిబాబు, చెల్లా శ్రీను, భాను, మురళీకృష్ణ, గోపి కుమార్, భాగ్యరాజు, శ్యామ్, వినోద్, బాలు, శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

అడ్డుకున్న వేములవలస గ్రామస్తులు.. అధికారులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని వేములవలస గ్రామం, పాత సినిమా హాల్ సర్వీస్ రోడ్‌లో ప్రభుత్వ స్థలంలో పక్కా నిర్మాణాలు చేపట్టడంతో పాటు విద్యుత్ స్తంభాన్ని ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు.దీనిపై స్థానిక గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. నిర్మాణ ప్రాంతానికి చేరుకున్న కార్యదర్శి రామకృష్ణ నాయుడు, ప్రభుత్వం స్థలంలో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రభుత్వ స్థలంలో పక్కా నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు



విద్యుత్‌స్తంభాన్ని కలుపుతూ ప్రహరీ నిర్మాణం

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తగరపువలస హైవేను ఆనుకుని ఉన్న ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 14న జరిగిన వివాహ వేడుకలో అపహరణకు గురైన రెండు తులాల బంగారు నెక్లెస్‌ను పోలీసులు రికవరీ చేశారు. తన భార్య బ్యాగ్‌లోని బంగారు నెక్లెస్ చోరీకి గురైందని రమేష్ పిర్యాదు మేరకు భీమిలి నేర విభాగం ఎస్ఐ ఎస్ సూర్య ప్రకాశ రావు దర్యాప్తు చేశారు. విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన రెడ్డి శంకరరావును నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. చోరీ ఆభరణం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై పి.ప్రసాదరావు తెలిపిన వివరాలు ప్రకారం... గొల్లలపాలెం గ్రామానికి చెందిన పక్కుర్తి నూకరాజు, బీమ చిన్నారావు మధ్య గతంలో బండి విషయంలో గొడవలు జరిగాయి. గురువారం రాత్రి అనుకోకుండా ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు. ఈ సమయంలో వారి మధ్య మాటమాట పెరగడంతో నూకరాజు పక్కనే ఉన్న కల్లుగీత కత్తి తీసుకున్న చిన్నారావుపై దాడి చేశాడు. తీవ్రగాయాలైన చిన్నారావును అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం మేలు

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : కేసుల రాజీలో మధ్యవర్తిత్వ ప్రక్రియ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు నూతన ప్రాంగణం సమావేశ మందిరంలో న్యాయవాదులకు ఐదురోజుల మధ్యవర్తిత్వ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ ఇతర దేశాలతో పోలిస్తే మధ్యవర్తిత్వ విషయంలో భారత్ వెనుకబడి ఉందన్నారు. కేసులను ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరించే దిశాశిక్షితులైన న్యాయవాదులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, ఫలితాలను రాబట్టాలన్నారు. ఢిల్లీకి చెందిన జాతీయ శిక్షకురాలు ఎస్ అరుణాచలం మాట్లాడుతూ, మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ చేసుకుంటే బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మరో జాతీయ శిక్షకురాలు బీన దేవి మాట్లాడుతూ న్యాయవాదులందరూ మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి కేసులను పరిష్కరిస్తే న్యాయస్థానాలపై పెండింగ్ కేసుల భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎంవి శేషమ్మ పరివేక్షణలో జరిగింది.

సాగరదుర్గ పండగకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో అయ్యప్పస్వామి పీఠం దగ్గర ఉన్న సాగరదుర్గమ్మ ఉత్సవాలను ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బుగత సత్యనారాయణ తెలిపారు. తొలిసారిగా గ్రామంలో నిర్మించిన పండుగపై స్థానిక రామాలయంలో గ్రామపూజారి, ఇతర పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపిపి కె.రాంబాబు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న వేడుకలో భాగంగా ఈనెల 23న ఆదివారం చాటింపు, విశ్వబ్రాహ్మణ వీధిలో తయారుచేసిన అమ్మవారి కర్ర ప్రతిమలను తీసుకొచ్చి, గ్రామపూజారి కనకల అచ్చన్న ఇంటి నుంచి ఊరేగింపు, ఈనెల 25న మంగళవారం అనుపోత్సవం నిర్వహిస్తామన్నారు. సాగరదుర్గమ్మ పండుగను విజయవంతం చేయాలని సత్యనారాయణ కోరారు.

పిఎం జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని తర్లువాడ కెనరా బ్యాంకులో పిఎం జన్‌ధన్ యోజన బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారు. బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షురాలు పిల్లా విజయ, నేతలుప్రసాదరావు పట్నాయక్, ఉప్పాడ అప్పారావు, సర్పంచ్ బిఆర్‌బి. నాయుడు కెనరా బ్యాంక్ మేనేజర్ దాసరి శరత్‌చంద్ర పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎం జన్‌ధన్ బ్యాంక్ ఖాతాల ద్వారా పిఎం జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష యోజన, బీమా వంటి ప్రయోజనాలు పొందవచ్చని, ఎటిఎం ఉంటే రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఖాతాలను కొనసాగించడం ద్వారా ఏటా బీమా రెన్యువల్ అవుతుందన్నారు. టిడిపి నాయకులు తాత్రాజు అప్పారావు, మజ్జి రమేష్ నాయుడు, పిల్లా సూర్య నారాయణ వెంకటరత్నం, పెంటరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

మంచినీళ్లు ఇప్పించండి!

◆ సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో వాడవాడలా సమస్యల ఏకరువు



ఆరిలోవ కొండవాలులో పర్యటిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - ఆరిలోవ : దాహార్తితో అల్లాడిపోతున్నామని, గుక్కెడు మంచినీళ్లు ఇప్పించాలని జివిఎంసి పదోవార్డు తోటగరువు, బిఎస్ఆర్ నగర్ వాసులు వేడుకున్నారు. శుక్రవారం ప్రజాచైతన్యయాత్రలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఆధ్వర్యంలో సిపిఎం బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివాసముంటున్నా తమకు నీటి సౌకర్యం కల్పించడం లేదని కాలనీవాసులు వాపోయారు. వర్షాలు కురిస్తే కొండచరియలు విరిగిపడతాయేమోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని, యుజిడి లేకపోవడంతో దుర్గంధంతో సహవాసం చేస్తున్నామని ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై సిపిఎం నేత కుమార్ స్పందిస్తూ, ఏళ్లతరబడి నివాసముంటున్న కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం దుర్మార్గమని, ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. సిపిఎం నాయకులు డి.నాగరాజు, ఎ.రమణ, సిహెచ్. రాము, పి.నాగమణి, మౌనిక, శంకర్ పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 73వ వార్డు పరిధి సింహగిరి కాలనీలో సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇంటింటా సమస్యల సర్వేలో కొండవాలు ప్రాంతంలో మౌలిక సౌకర్యాలు, ఇళ్ల పట్టాలు, 296 జిఒ ప్రకారం రిజిస్ట్రేషన్లు, 30 జిఒ పట్టాలు, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాల మార్పు, పందులు, కుక్కల బెడద తదితర సమస్యలను స్థానికులు విన్నవించారు. మున్సిపల్ కార్మికుడి ఇల్లు విద్యుత్‌షాక్‌తో కాలిపోతే, నష్టపరిహారం ఇవ్వలేదన్నారు.సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, బంగారునాయుడు, గొలగాని అప్పారావు, స్వర్ణలత, లక్ష్మి, నక్క నాగరాజు, సత్యం పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మడుతూరు, వెదురువాడ, గొర్లి ధర్మవరం గ్రామాలలో సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, నాయకులు కె.సోమునాయుడు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో నేటికీ ఉపాధి హామీ పనులు చేపట్టలేదని కూలీలు తెలిపారు. వెదురువాడ సర్వే నెంబర్ 1లో సుమారు 142 మంది నుండి 100 ఎకరాలు భూమిని ఏపీఐఐసీ తీసుకొని నేటికీ నష్టపరిహారం చెల్లించలేదని బాధిత పట్టాదారులు తెలిపారు. మడుతూరు ఎస్సీ కాలనీలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. చదువుకునే యువతకు ఎస్సీ జడ్ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడం లేదని పలువురు తెలిపారు. సిపిఎం నేత రాము మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కార్యాచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం చేస్తామన్నారు. పార్టీ నాయకులు గాలి అప్పారావు, శ్రీను, వంకర భవాని, జి..రమణ, ఇరుగుల రాణి, వంకర పైడిరాజు, బి.శ్రీను, రాజు పాల్గొన్నారు.



సింహగిరి కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు



అచ్యుతాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న రాము, సోమునాయుడు

కేంద్రీయ విద్యాలయ మూసివేతకు కుట్ర

- 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు
- విశాఖ విమల, కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి అడ్మిషన్లు చేపట్టాలని నిరసన



ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్రీయ విద్యాలయాన్ని మూసివేయాలనే కుట్రతోనే ఒకటో తరగతి అడ్మిషన్లను స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నిలుపుదల చేసిందని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు విమర్శించారు.. శుక్రవారం పాఠశాల ఆవరణలో అడ్మిషన్లు ప్రారంభించాలని కోరుతూ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఖర్చు తగ్గించుకోవడానికి విద్యార్థులకు ఇప్పుడు చౌకగా అందుతున్న విద్యను దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభించాలని స్థానిక ఎంపీ శ్రీభరత్‌తో కలిసి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని కోరినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఆయా విద్యాలయాల కోసం కూటమి నేతలు కనీసం పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర కేంద్రీయ విద్యాలయాలకు తరలించి, పూర్తిగా ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర మానుకోవాలని, తక్షణమే విశాఖ విమల విద్యాలయం, కేంద్రీయ పాఠశాలలలో ఒకటో తరగతి అడ్మిషన్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

జయకృష్ణకు ఘన సన్మానం



కుటుంబ సభ్యులతో సత్కార గ్రహీత జయకృష్ణ

ప్రజాశక్తి -మాధవధార : సిఎస్‌బి బ్యాంక్ విశాఖపట్నం బ్రాంచ్ ఆపరేషన్ మేనేజర్ సనపల జయకృష్ణను బ్యాంకు జోనల్ మేనేజర్స్ నాగరత్నం రామకృష్ణ, రవీంద్ర మల్లె, క్లస్టర్ మేనేజర్ రాజేష్ పుడి, బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ ఘనంగా సత్కరించారు. బ్యాంకు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధి పథంలో నడిపేందుకు జయకృష్ణ చేసిన సేవలను కొనియాడారు. దీనిపై జయకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు. బ్యాంకు ఉద్యోగులు, జయకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ ఇంగ్లీషు పరీక్షకు 78 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో అన్ని కేంద్రాల్లో పదోతరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో 28,609 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా 28,531 మంది విద్యార్థులు హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. సార్వత్రిక విద్యాపీఠ్ ద్వారా జరిగిన ఎస్ఎస్‌సి తెలుగు, ఉర్దూ పరీక్ష శుక్రవారం 15 కేంద్రాల్లో 723 మంది విద్యార్థులకు గాను 651 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 75 మంది హాజరు కాలేదు. జిల్లా అబ్జర్వర్ ఆరు కేంద్రాలను, తాను 12 పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 60 కేంద్రాలను సందర్శించినట్లు డిఇఒ తెలిపారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నెల్లేరు కస్తూర్బా బాలిక విద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరంలో ఆరవ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌తోపాటు ఏడో తరగతి, ఇంటర్ సెకెండియర్‌లో ఖాళీ సీట్లలో ప్రవేశాలకు వచ్చేనెల 11లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య శుక్రవారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఏడో తరగతిలో 2 సీట్లు, ఇంటర్ ఫస్టియర్‌లో 40 సీట్లు, సెకెండియర్‌లో 10 సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో తెలుపు రేషన్‌కార్డున్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గాయత్రి విద్యాపరిషత్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి -మధురవాడ : కొమ్మాది గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల సెక్రటరీ సోమరాజు ప్రారంభించిన వేడుకలో పాత్ర ఇండియా బిపిఒంసర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మి ముక్కవల్లి మాట్లాడుతూ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలంటే సమాజాన్ని అవగాహన చేసుకుని, లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. విశిష్ట అతిథులుగా ద్వారం వేంకటకృష్ణ గణేశ త్యాగరాజు, గాయత్రి విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ డి దక్షిణామూర్తి పాల్గొన్నారు. వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వాహనాల భద్రతపై దృష్టి పెట్టండి



కార్మికులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ వెంకటరమణ

ప్రజాశక్తి -ములగాడ: వాహనాల భద్రతపై యజమానులు దృష్టి పెట్టాలని మల్కాపురం క్రైమ్ ఎస్ఐ వెంకటరమణ సూచించారు. శుక్రవారం హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడుతూ, కంపెనీకి వచ్చే ఉద్యోగులు, కార్మికులంతా తమ బైక్‌ను రోడ్డుపక్కనే పార్కింగ్ చేస్తున్నారని, వాహనాలకు ఉండే తాళాలు తప్ప ఇతర రక్షణ వాటికి లేదన్నారు. తాళాలు అరిగిపోవడం వల్ల ఇటీవల వాహన దొంగతనాలు ఎక్కువయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో బైక్‌లకు చైన్‌తో తాళాలు వేసుకోవాలని సూచించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి -ములగాడ : మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని, విజయాన్ని సాధించాలని సెయింట్ ఆన్స్ నవజ్యోతి మ్యాక్స్ డైరెక్టర్ సిస్టర్ సంగీత అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా మండలిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఆర్థిక స్వాతంత్రం ఉన్నప్పుడే మహిళలు రాణించగలుగుతారన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇపిఎస్. భాగ్యలక్ష్మి సెయింట్ ఆన్స్ హాస్పిటల్ పరిపాలన అధికారి సిస్టర్ బిన్సీ ,సీనియర్ సిస్టర్ థెరిస్సిన్, యానిమేటర్లు, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై. అనసూయాదేవి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలో అన్ని ఆరోగ్యకేంద్రాల్లో ఆరోగ్య కార్యక్రమాల అమలుపై రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జూమ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. అందరు డిఎంహెచ్ఒలు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లతో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు, వ్యాక్సినేషన్, ఇతర పథకాలపై సమీక్షించి, సూచనలు చేశారు..

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు గ్రీన్ బెల్ట్, వాకింగ్ ట్రాకులలో శుక్రవారం అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్ పర్యటించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం డా లే అవుట్, ఆర్‌అండ్‌బి జంక్షన్, లలితా డిలైట్ గ్రీన్‌బెల్ట్ , వనితా వాకింగ్ ట్రాక్ , పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో మోడల్ లైటింగ్, బ్యూటిఫికేషన్, వాటర్ సప్లై మొదలైన అభివృద్ధి పనులను పరిశీలించారు. వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కరాస ప్రాంతంలో పలు కాలనీల్లో త్రీఫేజ్ విద్యుత్ లైన్ల పునరుద్ధరణపై అధికారులతో మాట్లాడి, వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ ఎఇఇ పల్లవి, పారిశుధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ మూర్తి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ అవుప్,సంతోష్ పాల్గొన్నారు

నేడు ఆదర్శ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పెందుర్తి,: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త సహకారంతో ఈ 22న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాలేజ్ ప్రిన్సిపల్ ఎస్.ఇ.ఫ్లోరా తెలిపారు. డబుల్ యుఎస్ఎస్, అమెజాన్, కాంసెంట్రిక్స్, యొకోహోమ, హ్యుందాయ్, మొబిస్, పొలగని, విస్ట్రోన్, సెన్సాకోర్ మెడికల్ కిట్స్ కంపెనీ, జేకే ఫెన్నర్ ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్ కంపెనీ, ఎమ్ ఆర్ ఎఫ్ మ్యానుఫ్యాక్చర్ కంపెనీ, అపెక్స్, ఫాక్స్‌కాన్ హియర్ బడ్స్ కంపెనీ, వరుణ్ మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్ తదితర 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని, ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, బిపిఒ, ఐటిఎస్, కస్టమర్ సర్వీస్, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్ తదితర ఉద్యోగాలకు అర్హులను ఎంపిక చేస్తారన్నారు. డిగ్రీ, ఐటిఐ, ఇంటర్, టెన్త్ ఉత్తీర్ణత కలిగిన యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి రూ. 1.5లక్షల నుంచి రూ. 2.5లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని కళాశాల సెక్రటరీ టి థియోఫిలస్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9154938472, 9154938478 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం: మండల భవిత కేంద్రంలో శుక్రవారం డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. డౌన్స్ సిండ్రోమ్ రావటానికి కారణాలను వివరించి, తోటి విద్యార్థులు వారి విద్యా, సామాజిక అవసరాల్లో సహకరించాలని సహితవిద్యా ఉపాధ్యాయులు కలమట శ్రీనివాసరావు వివరించారు. హెచ్ఎం కె .అంజనాకుమారి మాట్లాడుతూ, ప్రత్యేక శిక్షణతో డౌన్స్ సిండ్రోమ్ విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతారని, తల్లిదండ్రులు వీరి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కె.జయలక్ష్మి, సుబ్బలక్ష్మి , సహితవిద్యా ఉపాధ్యాయురాలు ఐ.నాగమణి పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ గ్రామీణ మండలం చినగదిలిలోని ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ వివిధ పార్టీల నేతలు, తహశీల్దార్ పాల్ కిరణ్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా గోదాములను సందర్శించి, అక్కడ పరిస్థితులను, సిసి కెమెరాల పనితీరు ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు.

జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఎం ఆధ్వర్యాన గిరిజన రైతుల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్
జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం మండలంలోని వాలాబులో గిరిజన జీడీ రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర మాట్లాడుతూ జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. వరి, చెరకు, పత్తి వంటి పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్న ప్రభుత్వం జీడి పంటకు మద్దతు ధర ప్రకటించడం లేదని పేర్కొన్నారు. మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడం, ధర నిలకడగా ఉండకపోవడంతో జీడిపిక్కలను వ్యాపారులు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వ్యాపారుల చేతికి జీడిపిక్కలు చేరిన తరువాత అమాంతంగా జీడి ధర పెరుగుపోతుందన్నారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేసారు. జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగా నిర్ణయించి అమలు చేయకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయమైన ధర చెల్లించే విధంగా కేజీ పిక్కలు రూ.200 చొప్పున చెల్లించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 25న దేవరాపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్నామని, జీడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాసాడ సన్యాసిరావు, మాదల అచ్చిబాబు, రాంబాబు, మాదల కృష్ణ, మాదల ధర్మరాజు, ఎరుకు నాయుడు, మాసాడ భీమరాజు, అధిక సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న జీడి మామిడి రైతులు, సిపిఎం నేతలు

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుకు 25 వరకు గడువు పెంపు

ప్రజాశక్తి-అనకాపల్లి : మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్, 5వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తుకు ఈ నెల 25 వరకు గడువు పొడిగించినట్లు అనకాపల్లి జిల్లా గురుకుల విద్యాలయాల కన్వీనర్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 25లోగా https://mjpapbcwreis.apcfss.in వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కొరకు ఏపిల్ 20న, 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

భవిత కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ దినోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ భవిత కేంద్రంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ దివాకర్‌రావు డౌన్ సిండ్రోమ్ గురించి, సమగ్ర శిక్షా ద్వారా అందిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. కోరమండల్ టియుఎస్ఆర్ వారు అందించిన స్మార్ట్ టీవీని ఎంఇఒ దివాకర్ ప్రారంభించారు. 30 స్కూల్ బ్యాగ్స్‌ను వికలాంగ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యమంలో పరవాడ ఎంపిపి స్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు, వికలాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, భవిత ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు ఆపాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో కాంట్రాక్ట్ కార్మికులను వైద్య పరీక్షలు పేరుతో వేధింపులకు గురి చేయడం తగదని ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం పరిశ్రమ ప్రధాని గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వైద్య పరీక్షలు పేరుతో వేధింపులకు గురి చేయడం, సుగర్, బీపీ ఉందని డ్యూటీకి వెళ్లడానికి అవకాశం లేదని డ్యూటీ నిలుపుదల చేయడం, అన్ని బాగా ఉన్నా సరే 1500 రూపాయలు సీఎంఒ ఆఫీసులో వసూలు చేయడం, ఇవ్వకపోతే బయట డాక్టర్ల నుండి ఫిట్ సర్టిఫికెట్ తెచ్చుకోమని చెప్పడం వంటి చర్యలకు అధికారులు పూనుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల కార్మికులు పని దినాలు కోల్పోవడంతో వారికి ఆర్థిక నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా వైద్య పరీక్షల పేరుతో కార్మికులను వేధింపులకి గురిచేయడం దుర్మార్గమన్నారు. ఎన్టిపిసి యాజమాన్యం కాంటాక్ట్ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఏ ఒక్క కాంట్రాక్ట్ కార్మికుడిని డ్యూటీ నుండి నిలుపుదల చేసినా పోరాటం ఉధృతం చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పిపి నాయుడు, పి గోవిందరాజు, డి రామారావు, ఎస్ రామారావు, ఎం సత్యనారాయణ, ఆర్ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

వ్యవసాయ, విద్యా రుణాలు ఎక్కువగా ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో వ్యవసాయం, విద్యా రుణాలు ఎక్కువగా అందించాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం డిసిసి, డిఎల్ఆర్‌సి త్రైమాసిక సమావేశం జిల్లా కలెక్టరు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను మాంస, కూరగాయల క్లస్టరుగా ప్రకటించినందున బ్యాంకులు వ్యవసాయ, డెయిరీ, పౌల్ట్రీ రంగాలకు రుణాలు ఇవ్వాలన్నారు. ఉపాధి రంగాలలో వచ్చే సంవత్సరానికి 17 శాతం వృద్ధి రావాలని, అందుకు అనుగుణంగా యూనిట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాలలో పశువులు, గొర్రెలు, నాటుకోళ్ల పెంపకం, మైదాన ప్రాంతంలో కూరగాయలు పెంపకం సాగయ్యే విధంగా ప్రణాళిక, యూనిట్లు స్థాపించాలని ఆదేశించారు. మాంస ఉత్పత్తులు యూనిట్లు, కూరగాయలు ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వకేంద్రాలకు విరివిగా రుణాలు అందించాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించుటకు విద్యారుణాలు అందించాలని, కళాశాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రుణమేళాలు నిర్వహించి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలని, ఇ-క్రాప్ ఆధారంగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్‌పి.నరేష్, ఆర్‌బిఐ ఎంజిఆర్‌ఎల్‌డిఒ రాజేష్ కుమార్ కుంద్, నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, డైరెక్టర్ ఎస్పిఐ బి.విజయకుమార్, డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి బి.రామమోహనరావు, ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు, పాల్గొన్నారు.


బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

సాధారణ భక్తులకు ప్రాధాన్యత

అనకాపల్లి : శ్రీనూకాంబిక అమ్మవారి వార్షిక జాతరలో సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. శ్రీనూకాంబిక పండుగను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మార్చి 28వ తేదీ నుండి ఏప్రిల్ 27 తేదీ వరకు జరుగనున్న అనకాపల్లి శ్రీనూకాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో దేవాదాయశాఖ, పోలీసు, జి.వి.ఎం.సి. ఎలక్ట్రికల్, ఎక్సైజ్, ఆర్.టి.సి. తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పండుగ నిర్వహణలో ప్రోటోకాల్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇచ్చి, గంటలోపు దర్శనం కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులు సంఖ్యకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎండతగలకుండా చలువ పందిళ్లు, మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశిబిరం, అత్యవసరానికి బెడ్లు, బిడ్డలకు పాలిచ్చుటకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, డిఎస్పి ఎం.శ్రావణి, పండుగ నిర్వహణ ప్రత్యేకాధికారి కె.శోభారాణి, ఆలయ నిర్వహణాధికారి బి.రాంబాబు, జిల్లా వైద్య ఆరోగ్యఅధికారి పి.రవికుమార్, జిల్లా అగ్నిమాపక, విపత్తుల నివారణ అధికారి ఆర్వి.రమణ, జివిఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.శేఖర్, జిల్లా సహాయ ఇంజనీరు ఎవివి శివప్రసాద్ పాల్గొన్నారు.

పిచ్చుకలను పరిరక్షిద్దాం

ప్రజాశక్తి-అనకాపల్లి : "మన ఇంటి పిచ్చుకల్ని మనమే రక్షించుకుందాం, పిచ్చుకలను పరిరక్షిద్దాం-పర్యావరణహితంగా జీవిద్దాం" అనే కరపత్రాలను అనకాపల్లి ఎంపీ వ్యక్తిగత సహాయకులు విజయ్ నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నానాటికి అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని రక్షించుకోవాలన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ గ్రీన్ క్లబ్ ద్వారా పట్టణంలో పలు ఆలయాల్లో పిచ్చుక గూళ్ళు ధాన్యపు కంకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీధర్ మాస్టర్ను, భోగ లింగేశ్వర ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో పెంటకోట ఉమామహేశ్వరరావు, బేతాళం శేషసాయి, రావూరి అనిత గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 24 , 25 తేదీలలో జరగాల్సిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెను వాయిదా వేసినట్లు యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కాండ్రేగుల హరికృష్ణ శుక్రవారం తెలిపారు. మేనేజ్మెంట్ నుండి సానుకూలమైన స్పందన రావడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని పేర్కొన్నారు. వారానికి ఐదు రోజులు పని దినాలు, కారుణ్య నియామకాలు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం, బ్యాంకులో ఖాళీగా ఉన్న సుమారు రెండు లక్షల బ్యాంకు ఉద్యోగాల భర్తీ చేయడం, టెంపరరీగా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేయడం, సెక్యూరిటీ గార్డుల్లో ఖాళీలను పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆడారి చంద్రశేఖర్, శరగడం శ్రీనివాస్, ఆడారి అప్పారావు, తోట శ్రీనివాసు, రామలక్ష్మి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

యోగా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రచారానికి కృషి చేసేందుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించే ప్రధాన మంత్రి యోగా పురస్కారాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సత్యపద్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కనీసం 20 సంవత్సరాలు సేవ, అద్భుతమైన ట్రాక్ రికార్డు, యోగ ప్రచారానికి, అభివృద్ధికి అద్భుతమైన సహకారం అందించిన వారు https://innovateindia.mygov.in/pm-yoga-awards-2025 అనే వెబ్‌సైట్ పోర్టల్ ద్వారా ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డైట్‌లో ప్రపంచ కవితా దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు కవితలు, పద్యాలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు బహుమతులను అందజేశారు. బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఈసీఈ విద్యార్థి ఏ.ఈశ్వర్ కవిత అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ మన పూర్వీకులు అందజేసిన వెలకట్టలేని ఆస్తి కవితలు, పద్యాలు, జానపద గేయాలు అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణేష్ ప్రసాద్ రెడ్డి, డీఎల్సిసి కోఆర్డినేటర్ షబీనా పాల్గొన్నారు.

త్వరలో అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ పనులను త్వరలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ప్రారంభిస్తారని ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. ఈ విషయంపై విజయవాడలోని ఆర్‌అండ్‌బి కార్యాలయంలో శుక్రవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిసి ఆర్ అండ్ బి ఎమ్‌డి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు.


సమావేశంలో పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు, విజయ్‌కుమార్

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

మోటార్ కార్మికులకు సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు పిలుపు

ప్రజాశక్తి-కశింకోట

మోటారు కార్మికుల సమస్యలపై ఈ నెల 24న సోమవారం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి మోటారు కార్మికులందరూ తరలివెళ్లి జయప్రదం చేయాలని సిఐటియూ జిల్లా అధ్యక్షులు శంకరరావు పిలుపునిచ్చారు. కసింకోట మండలం తాళ్లపాలెంలో ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ప్లకార్డులతో మోటారు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ చాలా మంది ఆటో కార్మికులు డిగ్రీ ఇంకా పెద్ద పెద్ద చదువులు చదివినప్పటికీ ఉద్యోగాలు రాక అప్పులు చేసి ఆటోలు కొనుక్కొని స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. అప్పులకు వడ్డీలు కట్టలేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలను ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకులు సీజ్ చేస్తున్న దయనీయ పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం జీరో వడ్డీ ఫైనాన్స్‌కు మోటార్ అండ్ ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని, ఇన్సూరెన్స్ చలానాలు, ఎఫ్‌సిలు టాక్స్‌లు, విడిభాగాలు ధరలు తగ్గించాలని కోరారు. 2019లో కేంద్ర బిజెపి ప్రభుత్వం సవరించిన కొత్త మోటార్ చట్టాన్ని రద్దు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన మోటార్ కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, లోవరాజు జి నారాయణరావు, కే శ్రీను, నాగేశ్వరరావు, ఎస్ రమణ, సూరిబాబు, పి కొండలరావు, ఎస్ సురేష్ పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న శంకరరావు



బోరు రిగ్గింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎంపిటిసి అప్పారావు

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కెపి.అగ్రహారం పంచాయతీ పరిధిలో రైతులు కల్లాల వద్ద మండల పరిషత్ నిధులతో మంజూరైన తాగునీటి బోర్ల రిగ్గింగ్ పనులను ఎంపిటిసి దేవర అప్పారావు శుక్రవారం ప్రారంభించారు. పడాల పెద్ద రమణ, చిన్న రమణ వారి కలాల ఈ బోర్లు వేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అడ్డూరి శ్రీను, అధ్యక్షులు తూరుబిల్లి నూకరాజు, పాల సంఘ అధ్యక్షులు తూరుబిల్లి కాసు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఇన్వెర్టర్, ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి జెఎన్ ఫార్మా సెజ్‌లోని ఫార్మా జెల్ (ఎక్స్ ఫ్లోరా) ఫార్మా కంపెనీ సిఎస్ఆర్‌లో భాగంగా ఇంటర్నల్ వైరింగ్‌తో పాటు 2కెవియు ఇన్వర్టర్, 70 ఎల్ఇడి బల్బులు, 5 సీలింగ్ ఫ్యాన్లు సమకూర్చింది. వీటిని శుక్రవారం ఫార్మా జెల్ మేనేజింగ్ డైరెక్టర్ అనంత డి.బార్పాధికర్, ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ టిజే.శ్రీనివాస్, హ్యూమన్ రిసోర్స్ వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర అప్పారావు, వి. అనిల్‌కుమార్ తదితరులు హాస్టల్‌కు అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఏ.సుజాత, ఫార్మాజెల్ సిఎస్ఆర్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

530 మంది మహిళలకు ఉల్లాస్ శిక్షణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని 35 గ్రామ పంచాయతీల పరిధిలో వెలుగు విఓఎల ద్వారా గ్రామాల్లో గుర్తించిన 530 మంది మహిళలకు ఉల్లాస్ అక్షరాస్యత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వి.విజయలక్ష్మి, వెలుగు ఏపిఎమ్ టి.రాజుబాబు తెలిపారు. ఇందులో భాగంగా నెల 23న అసెస్మెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారు ఆయా గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలలో పరీక్షల రాసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చౌడమాంబిక ఉత్సవ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి చౌడమాంబిక ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నికైంది. చైర్మన్‌గా ఒడిసెల సన్యాసినాయుడు, వైస్ చైర్మన్‌గా అనసూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా గెంజి అప్పలరాజు, సహాయ కోశాధికారిగా పితాని అర్జునరావు, కార్యదర్శిగా లావేటి లీలమోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా దమ్ము సూరిబాబు ఎన్నికయ్యారు. ఏప్రిల్ నెలలో జరగబోయే జాతర ఈ కమిటీ ఆధ్వర్యాన జరగనుంది.

'పోషణ్ భీ, పడాయి భీ'పై కొనసాగిన శిక్షణ

ప్రజాశక్తి-మునగపాక : 'పోషణ్ భీ, పడాయి భీ' కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తలకు రెండో శిక్షణ మండలంలోని తిమ్మరాజుపేట జెడిపి హైస్కూల్ జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు అన్నపూర్ణ, మీరాభీ మాట్లాడుతూ పిల్లలో పోషకాహార లోపాలను గుర్తించి ఏ సమయంలో ఎంత ఆహారం ఇవ్వాలనేది గృహ సందర్శన ద్వారా గుర్తించి పిల్లల తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివ నాయుడు, సిడిపిఓ ఇందిరాదేవి, హెచ్‌ఎం గాలి అప్పారావు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద శుక్రవారం మండల సూపర్వైజర్లు ఆర్.ఫైడితల్లి, సి హెచ్ స్వర్ణ ఆధ్వర్యంలో 43 మంది అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుండి 6 సంవత్సరాల పిల్లలు సమగ్రాభివృద్ధి సాధించాలంటే ఏం చేయాలి? అనే అంశాల అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



తిమ్మరాజుపేటలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, నాయకులు కాళ్ళ తెలయ్యబాబు డిమాండ్ చేశారు. అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ భారీ పేలుడు పదార్థాలతో బ్లాస్టింగులు చేసి అక్రమంగా క్వారీల్లో రాయిలను పేల్చడంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఇల్లు బీటలు వారుతున్నాయని, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. పంటల పైన, పశుగ్రాసంపైన దుమ్మి ధూళి పడడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. భారీ వాహనాలు అనకాపల్లి పట్నంలోకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అయినా మైనింగ్, రెవిన్యూ, రవాణా, పోలీసు అధికారులు మామూళ్లకు అలవాటు పడి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విమర్శించారు. అనకాపల్లి బిజెపి ఎంపీ సీఎం రమేష్ అక్రమార్కులకు అండగా ఉంటూ అధికారులను వారి పని వారు చేయకుండా అడ్డుకుంటున్నారని, దీంతో అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకొని అక్రమ క్వారీలను మూసివేయాలని, పర్యావరణాన్ని, కాలుష్యాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత గంటా శ్రీరామ్

న్యాయవాదులకు రక్షణ కల్పించాలని నిరసన



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-అనకాపల్లి

న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక న్యాయస్థానాల సముదాయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఏపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, దాడి చేసి న్యాయవాదులను లొంగ తీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఉన్న కోర్టులన్నీ అద్దె భవనంలో నడుస్తున్నాయని, ఇక్కడి పరిస్థితులు అటు న్యాయమూర్తులకు, ఇటు న్యాయవాదులకు, కక్షిదారులకు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయని వాపోయారు. ప్రభుత్వం తక్షణం స్థలాన్ని కేటాయించి కోర్టుల సముదాయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఐఆర్ గంగాధర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్ష్మణరావు, న్యాయవాదులు చిట్టా జయశ్రీ, బంధం వెంకటరమణ, ఐవిఎస్ ప్రసాద్, భూపతి, అవినాష్ ఇళ్ల, గంటా సురేష్, సానబోయిన కిషోర్, పిట్ల హరీష్, కొణతాల అరుణ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-యలమంచిలి : యవ్వనంలోకి అడుగు పెడుతున్న అమ్మాయిలు జాగ్రత్తగా ఆచితూచి వ్యవహరించాలని, లైంగిక వేధింపుల పట్ల అప్రమతంగా ఉండాలని స్థానిక టౌన్ ఎస్ఐ సావిత్రి ఉద్బోధించారు. కొత్తపేట హైస్కూలు విద్యార్థులనుకు శుక్రవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సహచర విద్యార్థుల ప్రవర్తన పట్ల దృష్టి సారించాలన్నారు. నేర ప్రవృత్తి గల విద్యార్థులను గుర్తించడం కష్టం కాదని, వారు చేష్టలు ముందే గమనించినా బయటపెట్టకపోవడంతో వారు నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వరలక్ష్మి, కరాటే ట్రైనీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సావిత్రి

వైసిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : వైసిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పరవాడ వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు అధ్యక్షతన శుక్రవారం అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకాలపై మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదీప్‌రాజ్ మాట్లాడుతూ పరవాడ మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అనుబంధ విభాగ అధ్యక్షులు నియామకాలు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి గ్రామం నుండి కమిటీల్లో పార్టీలో కీలకంగా పని చేసే వ్యక్తులకు స్థానం కల్పిస్తామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జడ్పీటీసీ పిఎస్ రాజు, వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, నాయకులు వెన్నెల సన్యాసిరావు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు చరణ్ రాజ్, యువజన విభాగం అధ్యక్షులు పెదిశెట్టి పూజ శేఖర్, సర్పంచ్‌లు వెన్నెల అప్పారావు, బొండా కనకరావు, పల్లా అప్పారావు నాగమణి, గొర్లి గోపి అమ్ములు, కూండ్రపు వరలక్ష్మీ సీతారామయ్య, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధి నరసింగపల్లి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట ఈఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసింగపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగపల్లి, జె.తుని, ఎన్జీ పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్.పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, యేనుగుతుని, చిన్న యెనుగుతుని, గొల్లగుంట, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మొసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఫార్మా సిటీ కాలనీలో ఆర్ఓ ప్లాంట్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మాసిటీ కాలనీలో ఆర్ఓ ప్లాంట్‌ను శుక్రవారం పున:ప్రారంభించారు. 9 సంవత్సరాల క్రితం ఫార్మా జెల్ కంపెనీవారు నిర్మించిన ఆర్ఓ ప్లాంట్ ఇటీవల కాలంలో మరమ్మతులకు గురైంది. దీనిపై పంచాయతీ సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ ఫార్మా జెల్ కంపెనీ వారికి తెలియజేయగా, సుమారు రూ.2.50 లక్షలు ఖర్చు చేసి కంపెనీ వారు మరమ్మతులు చేయించారు. శుక్రవారం గ్రామపంచాయతీకి తాళాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిఎస్ఆర్ ఇన్చార్జి సూర్యదేవర అప్పారావు, హెచ్ఆర్ రవి, ఎంపిడిఓ ధర్మారావు, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, చందక గోవిందరాజు, చందక కృష్ణ, అట్ట నూకరాజు, పంచాయతీ సెక్రటరీ గడసాల శ్రీను, గొల్లవిల్లి సతీష్, కోమటి కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈనెల 24 ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం మండలం వేములపూడిలో వైద్యాధికారి అనూష ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలందరూ ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరికైనా ఒక వారం మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్ష చేయించుకొని చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టీబీ యూనిట్ సూపర్వైజర్లు చక్రవర్తి, రాయ్, పిహెచ్‌సి సూపర్వైజర్లు మల్లిబాబు, రుక్మిణి, హోమియో డాక్టర్ దస్తగిరి, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట:క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్వైజర్ త్రిమూర్తులు తెలిపారు. వరల్డ్ టీబి దినోత్సవం సందర్భంగా గురువారం బుచ్చయ్యపేట పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బరువు తగ్గుట, దగ్గు తదితర ల లక్షణాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకర లక్ష్మి, ఏపీఓ వరహాలు బాబు, ఏఎన్ఎంపీ లక్ష్మి, పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు



బుచ్చయ్యపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది



మొక్కలు నాటుతున్న మహిళలు

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -రావికమతం:వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి మొక్కలు ఎంతగానో ఉపయోగ పడతాయని సర్పంచ్ దాసరి సూర్యకుమారి అన్నారు. మండలంలో కవగుంటలో పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మొక్కలు ఏపుగా పెరగడానికి గూడులు ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. ప్రతి ఇంటి, కల్లాల వద్ద ఒక్కొక్క మొక్క చొప్పున ప్రజలందరూ నాటాలని సూచించారు.

డిప్యూటీ సిఎంకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, ఈ నెల 20న అసెంబ్లీలో రెల్లిల స్థితిగతులను గుర్తించి న్యాయం జరిగేలా చేస్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడటంపై అభినందనలు తెలిపారు.రెల్లిలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించమని చెప్పారన్నారు. ఈ సమావేశంలో నీలాద్రిరావు, మాజీ సర్పంచ్ వడ్డాది కోటేశ్వరరావు, భవిరిశెట్టి కుమార్, కన్నారావు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:ఇఫార్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ సాగు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలు వసువు, మిరియాలు, అల్లం రైతులకు దిగుబడి, మార్కెట్, రాయితీలను వివరించారు.

ఆశీలు వేలంపాటలో వాగ్వాదం

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగుల కేంద్రంలో శుక్రవారం సంత ఆశీల వేలం పాటను స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాటదారుల నుంచి 2లక్షల 50వేల రూపాయల డిపాజిట్తో పాటు సాల్వేన్సి సర్టిఫికెట్లను పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు పర్యవేక్షణల్లో సిబ్బంది కట్టించుకున్నారు. అనంతరం రెండు గంటల నుంచి ఆశీల్ల పాట నిర్వహించారు. పాట ప్రారంభ దశలోనే టీడీపీ పార్టీ టౌన్ అధ్యక్షుడు వడ్డాది రంజిత్ వర్మ, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, సూర్యనారాయణ రాజు, జనసేన నాయకుడు రొబ్బ మహేష్ వేలంపాట జరగాలంటే గత ఏడాది పాటదారుడు కట్టాల్సిన పాత బకాయి 2లక్షల 50వేలు చెల్లించిన తరువాత పాట నిర్వహించాలని పట్టుబట్టారు. పంచాయతీ నిర్ణయించిన ధరకంటే పదిరెట్లు వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసికూడా బకాయిలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో పాటదారుని నుంచి సాల్వేన్సీ సర్టిఫికెట్ తీసుకోకుండా పాట నిర్వహించడంతో పాత బకాయిలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీంతో వైసిపి మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ, పంచాయతీ సీపర్లకు జీతాలు ఇవ్వాలంటే పంచాయతీ ఆదాయాన్ని పెంచాలని, గత ఏడాది కూడా అదే విధంగా పంచాయతీ నిబంధనలు పక్కన పెట్టి ఆశీలు పాతశాలలకు సంతలో అధికంగా ఆశీస్సులు వసూళ్ల చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో 8లక్షల 80వేలకు పాడుకున్నారని, ఇపుడు పంచాయతీ ధరలకు అనుగుణంగా ఆశీళ్ల వసూలు చెయ్యాలంటే పాటదారులు ముందుకురారని, దీంతో పంచాయ తీ ఆదాయానికి గండిపడి అభివృద్ధికి నోచుకోదన్నారు. నాయకులు మద్య చోటు చేసుకున్నా వాగ్విదంతో పంచాయతీ కార్యదర్శి గత ఏడాది పాటపై 5శాతం పంచాయతీ నిబంధనలు ప్రకారం కలిపి పాట గ్రామానికి చెందిన వ్యక్తికి కట్టబెట్టారు.



ఘర్షణ పడుతున్న నాయకులు

మాడుగుల సోమవారం, గురువారం జరిగే వారపు సంత ఆశీల పాటను పంచాయతీ సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథ శ్రీనివాసరావు, ఇంచార్జ్ ఈవోపీఆర్డి పీఎల్ ప్రతీష్ కుమార్, పండ్వాచేతీ కార్యదర్శి మూర్తిబాబు. పర్యవేక్షణలో జరిగిన ఈ సంత ఆశీల పాటకు 21 మంది పాటదారులు 2లక్షల 50వేల రూపాయలు డిపాజిట్ చేసు కున్నారు. పాతదారులందరూ బెల్లుగా ఏర్పడి పాట పాడేందుకు ముందుకు రాకపోవడంతో, గత ఏడాది పాటకన్నా, ఈ ఏడాది పంచాయతీ నిబంధనలు ప్రకారం 5శాతం పెంచి 9లక్షల 24వేల రూపాయల పాటని నిర్ణయించడంతో గ్రామానికి చెందిన మాటూరు కొండాజీ కైవసం చేసుకున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల వైసీపీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 22 మందిని కంటి చికిత్సలకు విశాఖపట్నం పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు

పలుచోట్ల పి-4 సర్వేపై గ్రామసభలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు పి – 4 సర్వే పై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ఇంటింటా పి – 4 సర్వే చేపట్టారు. ఈ మేరకు సర్వే చేపట్టిన వివరాలను గ్రామ సభలో వెల్లడించారు. గ్రామ సభలను ఎంపీడీవో డి సీతారామరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో హాజరైన అధికారులు

కోటవురట్ల: పి4 సర్వేపై శుక్రవారం మండల వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు పి4 సర్వే పట్ల నిర్లక్ష్యం చేయకుండా అధికారులు అడిగిన ఆధారాలు అందజేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు భవిష్యత్తులో సక్రమంగా అమలు చేసేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోటవురట్లలో జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను, ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు



మాట్లాడుతున్న టిడిపి నేత వెంకటేష్

చీడికకు రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గిరిజన గ్రామమైన చీడికలో గిరిజన విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ మంజూరుకు హోం మంత్రి వంగలపూడి అనిత కృషి చేశారని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. నక్కపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ గ్రామ నాయకులతో కలిసి మాట్లాడారు. గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం చీడిక గ్రామంలో రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ నిర్మాణం కోసం 2 కోట్ల 30 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. హోం మంత్రి అనిత గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా చీడిక గ్రామానికి రోడ్డు వేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే అనేక గ్రామాల్లో రోడ్లు నిర్మాణాలు, పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివారించేందుకు గాను ముందస్తు ప్రణాళిక రూపొందించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గింజాల లక్ష్మణరావు, దార్ల కృష్ణ, చీడిపల్లి దొరబాబు, కర్రి అప్పారావు, దొర పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఉచిత విద్యుత్ పథకం అమలుకు వినతి

ప్రజాశక్తి వడ్డాది:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో అమలు చేయాలని వడ్డాది తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు దొండా నరేష్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బుచ్చయ్యపేట మండలంలో ఉన్న మొత్తం 20 నాయిబ్రాహ్మణుల షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వర్తించేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపేట మండల నాయి బ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు కాకినాడ శేషు, తలారి శంకర్, అక్కిరెడ్డి కనకరాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాలిబాట ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: ప్రజలు వినియోగించే తాగునీటి బోరు, రాకపోకలు సాగించే కాలిబాటను ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలో పెదపూడి గ్రామానికి చెందిన గోకివాడ మహేష్ సత్తిబాబు బుచ్చయ్యపేట పోలీసులకు పంచాయతీ కార్యదర్శికి, అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 15 సంవత్సరాల క్రితం ప్రజలు వినియోగించుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి బోర్‌ను, కాలిబాటను ఆక్రమించి ప్రహరీ నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక కేజీబీవీలో 2025- 2026 విద్యా సంవత్సరానికి ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎస్ఓ తులసి ఒక ప్రకటనలో తెలిపారు. 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతు న్నామన్నారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 1 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇతర వివరాలకు ఫోన్:7075159996, 7075039990ను సంప్రదిం చాలని కోరారు.

లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి-నాతవరం: లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. లోకనాథం పిలుపునిచ్చారు. మండలంలోని సుందరకోట పంచాయితీ అసనగిరి గ్రామం లో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఈ అడవిని నమ్ముకొని జీడిమామిడి, వరి సాగు చేసుకొని, పశువులను మేపుకొని జీవిస్తున్నామన్నారు. లేటరైట్ పేరుతో ఈ కొండలను తవ్వడానికి తాము అంగీకరించమని ముక్తంఠంతో చెప్పారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ, గతంలో వైసిపి అటవీ, పర్యావరణ, గిరిజన చట్టాలను ఉల్లంఘించి అడ్డగోలు గా అక్రమైనింగ్ కు పాల్పడిందన్నారు. పర్యావరణం, అటవీ ధ్వంసం అయ్యిందని తెలిపారు. నేడు తెలుగు దేశం అదికారం చేపట్టాక మళ్ళీ లేటరైట్ తవ్వకాలకు సిద్దపడుతుందని దుయ్యబట్టారు. చట్టాలు చేసి, అమలు చేసే శాసనసభకు అధిపతి ఈ నియోజకవర్గ శాసన సభ్యులు గా ఉన్నారని తెలిపారు. షెడ్యూల్డ్ ఏరియా ప్రాతంలో ఉన్న ఈ ప్రాతానికి పీసా, 1/70, ఇతర చట్టాలు వర్తిస్తాయన్నారు. ఈ చట్టాలను కాపాడాల్సిన భాద్యత గౌరవ శాసన సభాపతిపై ఉందని చెప్పారు. మైనింగ్ మాపియా ఇప్పటికే గిరిజనలకు డబ్బు ఆశ చూపుందన్నారు. చట్టాలను ఉల్లంఘించి లేటరైట్ తవ్వకాలకు అనుమతించడంతో అనకాపల్లి జిల్లాలో సరుగుడు, సుందరకోట పంచాయితీ లో 16 గ్రామాల గిరిజన ప్రజలతో పాటు మైదాన ప్రాతం వ్యవసాయం, తూర్పు గోదావరీ జిల్లాలో గిరిజనలు సర్వస్వం కొల్పోతారన్నారు. దొడ్డిదారిన అనుమతులు పొంది అక్రమమైనింగ్ పాల్పడబోతున్నారన్నారు. ఇందులో అనేకమంది వ్యాపారస్తులు బాగస్వామ్యం అయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వికశీత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యం కు భిన్నంగా వ్యవరిస్తుందని దుయ్యబట్టారు. పర్యావరణం, ప్రజల జీవితాలు, సహజ వనరలను కొల్లగొట్టడమే ధ్యేయంగా పని చేస్తుందని విమర్శించారు. గత పదిహేనేళ్ళ క్రితం గిరిజనులు ప్రజాబిప్రాయ సేకరణలో లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించారని గుర్తు చేశారు. మళ్లీ తవ్వకాలకు పూనకోవడం తగదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం లేటరైట్ తవ్వకాలను ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలలో మౌలిక సౌకర్యాలకు చర్యలు తీసుకొవాలని, లేకుంటే గిరిజనుల ఆగ్రహానికి గురికావల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, అనకాపల్లి జిల్లా కమిటీ సబ్యులు అడిగర్ల రాజు, గ్రామస్తులు పాండవల నూకరాజు, చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న లోకనాథం, తదితరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్
రూ.3.41 కోట్ల పన్ను చెల్లింపు

ప్రజాశక్తి - గాజువాక : ఈ నెల 31కి ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యం లో జివిఎంసికి చెల్లించాల్సిన పన్నుకు సంబంధించి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రూ.3 కోట్లా 41 లక్షలా 47 వేలా 156ను అధికారులకు చెల్లించింది. సంబంధిత చెక్కును జివిఎంసి గాజువాక అధికారులు స్వీకరి ంచారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, అసిస్టెంట్ కమిషనర్ రామ్‌నారా యణ, ఆర్‌ఐ శివ పాల్గొన్నారు.


చెక్కు అందుకుంటున్న శేషాద్రి

సంచార ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ఆధ్వర్యంలో నగరంలోని గాజువాక, కెఆర్‌ఎం కాలనీ వంటి ప్రధాన ప్రాంతాలలో సంచార ఆర్‌ఆర్‌ఆర్ (రిడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాలను ప్రారంభించామని స్క్రాప్ క్యూ సంస్థ ప్రతినిధి సుంకరి తులసీరాం తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల సేవలు ఏప్రిల్ 1 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. దీంతో వ్యర్థాల (చెత్త) నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ పెరుగుతుందని అన్నారు. విశాఖపట్నం వ్యాప్తంగా ఆరు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. వాటిలో భాగంగా రెండు విద్యుత్ వాహనాలతో జివిఎంసి పరిధిలోని 98 వార్డుల్లో వందకుపైగా పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయనున్నట్టు పేర్కొన్నారు. జివిఎంసి పరిధిలో సుమారు 150 రకాల రీసైకిల్ చేయదగిన వ్యర్థాలను సేకరించేందుకు స్క్రాప్‌క్యూ భాగస్వామ్యం కలిగి ఉందన్నారు.

5న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శ్రీ రామ నవమి సందర్భంగా విశాఖపట్నం నుంచి భద్రాచలంనకు ఏప్రిల్ 5న ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు, అలాగే సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక బస్సులు విశాఖలోని ద్వారకా బస్ స్టేషన్ నుండి వయా రాజమండ్రి మీదుగా నడుపబడతాయని పేర్కొన్నారు. ప్రయాణికులు, భక్తులు ముందస్తుగా రిజర్వేషన్ చేయుంచుకోవాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలపై దాడులను వ్యతిరేకిద్దామని ప్రజా సంఘాల ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్వేరో నెట్వర్క్ రాష్ట్ర కన్వీనర్ ఎం.చిట్టయ్య శుక్రవారం పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త శివ నారాయణ రాజు పై జరిగిన దాడిని ఖండిస్తూ వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 22న శనివారం సాయంత్రం ఐదు గంటలకు కృష్ణ ప్యాలెస్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పైన పోరాటం చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఎస్‌సి వర్గీకరణపై హర్షం

ప్రజాశక్తి -చీడికాడ: ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తున్న ఎస్సీల వర్గీకరణ జరగడం సంతోషకరమని మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తురువో లు గ్రామంలో స్థానిక కార్యకర్తలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో30 సంవత్సరాలుగా అలుపెరిగిన పోరాటం చేశారన్నారు. ఆ పోరాటంలో అమరులైన వీరులకు, వారి త్యాగాలకు, వారి కుటుంబాలకు ఈ విజయం అంకితమన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలు అన్ని పట్టణాలు గ్రామాల్లో భారీగా విజయోత్సవ సభ త్వరలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కలిగొట్ల పైడయ్య , కలిగొట్ల అప్పయ్య, కార్యక్రమంలో పాల్గొన్నారు.

కారిడార్ రోడ్డు పనులు అడ్డగింత


అడ్డగిస్తున్న సాగుదారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని డి ఎల్ పురంలో కారిడార్ రోడ్డు పనులను పలువురు డి పట్టాదారులు అడ్డగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కిల్లాడ కృష్ణ, పలువురు డీ పట్టాదారులు మాట్లాడుతూ, 1967 లో 14 మందికి 64.65 ఎకరాల భూమిని ఆనాడు ఇవ్వడం జరిగిందని, నాటి నుండి నేటి వరకు భూమిపై వచ్చే పరిహారంతో జీవనం సాగిస్తున్నామన్నారు. పరిహారం చెల్లించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. కోర్టులో కేసు ఉండగా పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పనులు అడ్డగిస్తే తమపై పోలీసులు బెదిరింపు చర్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారాన్ని కోర్టులో జమ చేస్తే, కోర్టు తీర్పు మేరకు నడుచుకుంటామన్నారు. పరిహారం చెల్లించే వరకు పనులు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి పట్టాదారులు ఏడిద అప్పారావు, యేసు, గింజాల అప్పారావు, చిరంజీవి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ప్రియాంక ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఈ నెల 22 నుంచి 25వ తేద వరకు చత్తీష్‌ఘడ్ బిలాస్పూర్‌లో జరగనున్న నేషనల్ ఉషు టోర్నమెంట్‌కు నర్సీపట్నం నుండి వేపాడ ప్రియాంక వెళ్లనున్నారు. 70 కేజీల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి పాల్గొంటున్నట్లు సీనియర్ కోచ్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు ప్రియాంకను నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, శ్రీకాంత్, ఎన్‌ఆర్‌ఐ డైరెక్టర్లు అల్లాడ సురేష్, శాప్ కోచ్ అబ్బు, అభినందించారు.



గేట్‌లో అశోక్‌కు 12వ ర్యాంక్

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం మర్రి వలస గ్రామానికి చెందిన అమిరెడ్డి అశోక్ ఇటీవల విడుదలైన 2025 గేట్ లో జాతీయ స్థాయి 12 వ ర్యాంక్ సాధించాడు. నూజివీడు ట్రిపుల్ ఐటీ లో ఇంజనీరింగ్ చదువుతున్న అశోక్ ఈ ఘనత సాధించాడు. కొత్తకోట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2019 మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షలో ఈ విద్యార్థి 10/10 పాయింట్లు సాధించాడు. ప్రభుత్వం పాఠశాలల తరుపున నూజివీడు ట్రిపుల్ ఐటీ కి ఎంపిక అయ్యాడు. నూజివీడు ట్రిపుల్‌లో ఫైనల్ కెమికల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. గేట్ ప్రవేశ పరీక్షలలో జాతీయ స్థాయిలో 12వ ర్యాంక్ సాధించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన విద్యార్థి అశోక్ ఘనత సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం తోపాటు, గ్రామంలో పలువురు అభినందించారు.



వైసిపి నేతలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: వ్యవసాయ భూమిలో పంటను ధ్వంసం చేసిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలో చిన భీమవరం గ్రామానికి చెందిన ఎలంకాయల గోవిందానాయుడు గురువారం అనకాపల్లిలో ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో సర్వే నెంబర్ 256/6 258/7 లో సుమారు 2.35 ఎకరాలు డి పారం పట్టా భూమిలో గల కంచెను గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు 11-6-2023లో డ్రిప్ పైప్‌లు, కొబ్బరి మొక్కలు కంచె నాశనం చేసారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. దీనిని అసరా గా తీసుకోని మళ్ళీ భూమిలోకి వచ్చి దౌర్జన్యం చేయడానికి చూస్తున్న వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు..

010 పద్దు కింద జీతాలు ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షనర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్ల సంయుక్త సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న గ్రంథాలయ సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల అకౌంటుకు జమ చేయాలని, గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయి గ్రాంటును వెంటనే విడుదల చేయాలని, ఇతర అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ సమావేశం వివిధ తీర్మానాలను ఆమోదించింది. తూర్పుగోదావరి జిల్లాతో కలుపుకొని ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు కన్వీనర్‌గా పది మందితో కమిటీ ఏర్పడింది. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలాది సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలను ఆధునికీకరిస్తామని రాష్ట్ర గ్రంథాలయాలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీనియర్ నాయకులు బి.ఆనందరావు, శ్రీకాకుళం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వైకుంఠరావు, విజయనగరం జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామభద్రరాజు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆనందరావు వివిధ సమస్యలపై మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గ్రంథాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చీడిగుమ్మలలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -అనకాపల్లి డెస్క్: గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో వేసవి దృష్ట్యా పంచాయతీ కార్యదర్శి గౌరీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఉప సర్పంచ్ సత్యనారా యణ ప్రారంభించారు. ప్రయాణికు లకు మజ్జిగను అందజేశారు. దీన్ని వినియోగించు కోవాలని నిర్వాహకులు కోరారు.